పల్లెసీమల్లో సకల సౌకర్యాలు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ముసునూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: జగనన్న పాలనలో పల్లెసీమలన్నీ సకల సౌకర్యాలమయంగా మారాయని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ముసునూరు హైస్కూల్లో శనివారం ఎంఈఓ బీవీ సుబ్బారావు అధ్యక్షతన రూ.1.23 కోట్ల నిధులతో నిర్మించిన ఐదు అదనపు తరగతి గదులను ప్రారంభించారు. పంచాయతీ రాజ్ డీఈఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూ.21.80 లక్షల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో రూ.20 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో బడుగువారిగూడెంలో ఏర్పాటుచేసిన 3.1 కి.మీ, తాగునీటి పైప్‌లైన్, 175 కుళాయిలను ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంపీపీ దుర్గాభవానీ వెంకట్రావు, వైస్ ఎంపీపీ రాజా నాయన, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, సర్పంచ్ విజయలక్ష్మి, సత్యనారాయణ, ఎంపీడీఓ జి.రాణి, వ్యవసాయశాఖ ఏడీఈ విద్యాసాగర్, ఏఓ మధుమోహన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, హెచ్‌ఎం సునీల పాల్గొన్నారు.

పల్లెల్లో పింఛన్ల సంక్రాంతి

ముసునూరు: పెంచిన పింఛన్ల రాకతో పల్లెల్లోని ముందే సంక్రాంతి పండగ వచ్చిందని ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో ఎంపీపీ దుర్గాభవాని వెంకట్రావు అధ్యక్షతన పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, తహసీల్దార్ డి.సుధ, సర్పంచ్‌లు కంచర్ల వాణి, పిల్లి సత్యనారాయణ, ఎస్. సత్యనారాయణ, పి.కృష్ణ, దామోదరరావు, ఆర్ శ్రీదేవి, పి.మోహనరావు పాల్గొన్నారు.

నెరవేరిన సొంతింటి కల

చంద్రాల(మైలవరం): జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ద్వారా పేదల సొంతింటి కల నేరవేరిందని వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు తెలిపారు. మైలవరం మండలం చంద్రాల సచివాలయంలో జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంలో భాగంగా అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం గ్రామ సర్పంచ్ జే జ్యోతి అధ్యక్షతన జరిగింది. కేవలం నామమాత్రపు రిజిస్ట్రేషన్ చార్జీలతో వారు నివాసముంటున్న గృహాన్ని రిజిస్ట్రేషన్ చేసి దానిపై వారికి సర్వ హక్కులు కల్పించినట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు సంపూర్ణ గృహ హక్కు పథకానికి సంబంధించిన రిజి స్ట్రేషన్ డాక్యుమెంట్‌లు అందజేశారు.

స్టడీ మెటీరియల్ అందజేత

నూజివీడు: స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్లోని పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ స్టడీ మెటీరియల్‌ను 1982–83 సంవత్సరం పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సౌజన్యంతో శనివారం అందజేశారు. ముఖ్యఅతిథిగా ఇంటిలిజెన్స్ అడిషనల్ ఎస్పీ సింగపల్లి శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. హైస్కూల్ హెచ్‌ఎం బి.హేమలత, అసోసియేషన్ అధ్యక్షుడు కె.చలపతిరావు, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఐత్తుల అనురాధ, మండల ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరావు పాల్గొన్నారు.

నిస్వార్థ రాజకీయాలే నా అభిమతం

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



జి.కొండూరులో పింఛను కానుకను అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

జి.కొండూరు: రాజకీయాలను స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవడం తన హిస్టరీలోనే లేదని, అభివృద్ధిలో కానీ, సంక్షేమ పథకాల అమలులో కానీ ఉద్దేశపూర్వకంగా ఎవరనీ ఇబ్బంది పెట్టిన దాఖలాలు కూడా లేవని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్లో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌లను ప్రతి ఏటా పెంచుకుంటూ రూ.3వేలకు తీసుకు రావడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి సంక్షేమ పథకం ఎటువంటి లంచాలు, రాజకీయ, కుల, మత ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటికే అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. మైలవరం నియోజకవర్గం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని అభివృద్ధి కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

గంపలగూడెం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే ఓటర్లు త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో జగనన్ననే మళ్లీ ఎన్నుకోవాల్సి ఉందని గంపలగూడెం ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం పెంచిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలపై మాట తప్పకుండా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, నాయకులు చెన్నకేశవరెడ్డి, కరుణాకరరావు, మాజీ ఎంపీపీ కోట దాసు, ఏఎంసీ వైస్ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో పూత కోసం సస్యరక్షణ చర్యలు

నూజివీడు: యాజమాన్య, సస్యరక్షణ పద్ధతులను పాటిస్తే పూతలు రాని మామిడి తోటల్లో పూతలు వస్తాయని ఉద్యాన అధికారి హేమ అన్నారు. నూజివీడు మండలం బోర్వంచ, రావిచర్లలో శనివారం మామిడి తోటలను ఆమె పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. మామిడి పూతలు రాని తోటల్లో రైతులు మల్టీ కే 10 గ్రాములు లీటరు నీటికి కలిపి గాని, ప్లానోఫిక్స్ 4.5 ఎంఎల్ మందును 10 లీటర్ల నీటిలో కలిపి చెట్లకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. దీంతో పాటు బోరాన్ 2 గ్రాములు లీటరు నీటికి, జింక్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

తిరుపతమ్మ ఆలయ ఆదాయం రూ.1.36 లక్షలు

బొర్రగూడెం(మైలవరం): మైలవరం మండలం బొర్రగూడెంలోని తిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల ఆలయంలో శనివారం నిర్వహించిన వివిధ రకాల వస్తువులు విక్రయ షాపుల వేలం ద్వారా ఆదాయం రూ.1,36,500 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సాంబశివరావు తెలిపారు. ఆలయ వంశపారం పర్య ధర్మకర్త, భక్తుల సమక్షంలో దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి అనురాధ పర్యవేక్షణలో ఈ వేలం పాట నిర్వహించినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా బ్రెయిలీ జయంతి

గానుగపాడు(తిరువూరురూరల్): అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యకమాన్ని శనివారం మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గంపలగూడెం: చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కే మోతీలాల్ పేర్కొన్నారు. గంపలగూడెం వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో శనివారం నిర్వహించిన లీగల్ లిట్రసీ క్యాంప్‌లో ఆయన మాట్లాడారు. పోక్సో తదితర చట్టాల గురించి వివరించారు. బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి అంకిరెడ్డి అంజనరెడ్డి, సీనియర్ న్యాయవాదులు అత్తునూరు ప్రభాకర్‌రెడ్డి, మొగపర్తి సత్యం, కోట జమలయ్య మాట్లాడుతూ వివిధ చట్టాల ద్వారా రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హక్కులను తెలిపారు. హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ సభ్యులు దాసు, మండల సమాఖ్య అధ్యక్షురాలు లింగమ్మ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

ఏ.కొండూరు: రబీ సీజన్లో పంట సాగు చేసి రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి టిప్పు సుల్తాన్ సూచించారు. మండలంలోని కుమ్మరికుంట్లలో శనివారం పంట నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతులు సాగు చేసిన పంట పొలాల్లోకి వెళ్లి పంట నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఈఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

రేపు వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

మైలవరం: మైలవరం పాత ఆస్పత్రి వద్ద వంగవీటి మోహన రంగా కాంశ్య విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆవిష్కరించనున్నట్లు రాధా రంగా మిత్ర మండలి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం జమీందారు రాజా ఎస్వీ సుధాకరరావు ఆశీస్సులతో జరిగే ఈ ఆవిష్కరణలో విజయవాడ సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాబాబు, ప్రభుత్వ విప్, టీటీడీ బోర్డు సభ్యులు సామినేని ఉదయభాను, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, నందిగామ ఎమ్మెల్యే జగన్మోహనరావు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి పాల్గొంటారని పేర్కొన్నారు.

ముదిరాజుల ఆత్మీయ సమావేశం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ముదిరాజుల ఆత్మీయ సమావేశం మండలంలోని మూలపాడులో శనివారం జరిగింది. ముదిరాజుల మహాసభ జిల్లా అధ్యక్షుడు దుప్పల శివాజీ అధ్యక్షతన సమావేశం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షులు రవిబాబు, నారాయణ, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పింఛన్ అందజేత

నూజివీడు: స్థానిక ఎమ్మార్ అప్పారావు కాలనీకి చెందిన వలంటీర్ బెల్లన జ్యోతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సారథి లక్ష్మికి శనివారం వితంతు పింఛన్ రూ.3 వేలు అందజేసింది. దీంతో లబ్ధిదారురాలు, ఆమె కుటుంబ సభ్యులు వలంటీర్‌ను అభినందించారు.

రామాలయంలో పూజలు

చాట్రాయి: తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సతీమణి తుమ్మల భ్రమరాంబ శనివారం మండలంలోని చనుబండ కోదండ రామాలయం, సూరంపాలెం అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. రామాలయం వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులు ఆలయ మర్యాదలతో పూజలు నిర్వహించారు.

చాట్రాయి తహసీల్దార్‌గా రంగారావు

చాట్రాయి: మండల తహసీల్దార్‌గా వై.రంగారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల చాట్రాయి తహసీల్దార్ విశ్వనాథరావు మృతి చెందడంతో నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న రంగారావును తహసీల్దార్‌గా నియమించారు.

పూడిక తొలగింపు

సాక్షి కథనానికి స్పందన

ఆగిరిపల్లి: ఈదులగూడెంలో పారిశుద్ధ్య పరిస్థితి బాగాలేదని, మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుందంటూ సాక్షి బుధవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎంపీడీఓ శంకరరావు పనులను పరిశీలించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడల్లోనూ రాణించాలి

పుల్లూరు(మైలవరం): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని పుల్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరు రామిరెడ్డి తెలిపారు. మైలవరం మండలం పుల్లూరులో శనివారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకుడు అప్పిడి సాంబిరెడ్డి పాల్గొన్నారు.

రాముని అక్షింతల గ్రామోత్సవం

జూపూడి(ఇబ్రహీంపట్నం): అయోధ్య శ్రీరామ అక్షింతలతో శోభాయాత్ర జూపూడి గ్రామంలో నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం ప్రత్యేక పూజలు అనంతరం పల్లకీలో ఉత్సవ విగ్రహాలు ఉంచి శోభాయాత్ర నిర్వహించారు.

రేపటి లోపు విధుల్లో చేరాలి

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సమ్మె విరమించి అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ నెల ఎనిమిదో తేదీ లోపు విధుల్లో చేరాలని తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సత్యవతి తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ఎస్మా చట్టం కింద వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించిందని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఐదు గంటల వరకు గడువు ఉందని తెలిపారు.

సెయింట్ థామస్ హైస్కూల్ వార్షికోత్సవం

నూజివీడు: స్థానిక సెయింట్ థామస్ హైస్కూల్ వార్షికోత్సవం శనివారం ప్రిన్సిపాల్ రెవ. బ్రదర్ చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయవాడ ఎస్ఎస్ఎం స్కూల్ ప్రతినిధి రెవ. బ్రదర్ రాయప్పరెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్య వల్ల వినయం, విధేయత, సమాజంలో గౌరవం లభిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చిన్నారులకు టీకాలు

తిరువూరు: వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సచివాలయాల్లో శనివారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో, ధనుర్వాతం తదితర వ్యాధులు సోకకుండా వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

మైలవరంలో విస్తరిస్తున్న వ్యాపార, వైద్య రంగాలు



మైలవరం జమీందారుల కోట

మైలవరం: మైలవరంలో వ్యాపార, వైద్య రంగాలు బహుళ సంఖ్యలో విస్తరిస్తున్నాయి. గతంలో శుభ కార్యాలకు సామాను కొనుగోలు చేయాలన్నా, ఒక మోస్తరు వైద్య చికిత్స చేయించుకోవాలన్నా విజయవాడ, గుంటూరుకు వెళ్లాల్సి వచ్చేది. నాడు రవాణా సౌకర్యాలు కూడా అంతంత మాత్రంగా ఉండేవి. నేడు దీనిని అధిగమించి అన్ని సౌకర్యాలు ఇక్కడే లభిస్తున్నాయి. పెళ్లిళ్లు, పేరంటాళ్లకు నూతన వస్త్రాలు కావాలన్నా ఏ ఖరీదులో కావాలన్నా ఇక్కడే లభిస్తున్నాయి. అదేవిధంగా వైద్య రంగం కూడా బాగా అభివృద్ధి చెందింది. ఆధునిక సౌకర్యాలుతో కొత్త ఆస్పత్రులు ఏర్పాటు చేస్తూ కొన్ని చికిత్సలకు ఆపరేషన్ కూడా ఇక్కడే నిర్వహిస్తుండటం అభివృద్ధిని తెలియజేస్తుంది. అన్ని రకాల వ్యాధులకు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండటం విశేషం. విజయవాడకు చెందిన ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రులు కూడా తమ బ్రాంచ్‌లను మైలవరంలో ఏర్పాటు చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నాయి. మరికొద్ది కాలంలో మైలవరం విజయవాడలో కలిసి పోయే అవకాశం ఉందేమో.. వేచి చూడాల్సిందే.

అన్ని విధాలుగా అభివృద్ధి



మైలవరంలో వైద్య రంగం బాగా అభివృద్ధి చెందింది. నాణ్య మైన వైద్య, నిపుణులైన డాక్టర్లు ఇక్కడ సేవలందించడంతో వీరికి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉంది. కార్పొరేట్ ఆస్పత్రుల బ్రాంచ్‌లు కూడా తమ శాఖలను ఇక్కడ ఏర్పాటు చేస్తుండటం అభివృద్ధికి చిహ్నంగా మారింది.

– డాక్టర్ ఎం.సాయిశ్రీనివాసరెడ్డి, ఆయుర్వేద వైద్యులు, మైలవరం

ఎంతో అభివృద్ధి చెందింది



మైలవరం వైద్య, వ్యాపార రంగాలలో బాగా అభివృద్ధి చెందుతోంది. గతంలో స్థానికులు అవసరమైతేనే విజయవాడకు వెళ్లేవారు. ప్రస్తుతం పరిపూర్ణమైన వైద్య సౌకర్యాలు ఇక్కడే లభిస్తుండటంతో ఇక్కడే చికిత్స తీసుకుంటున్నారు.

– డాక్టర్ సీహెచ్ బాలగోపాలరెడ్డి, దంత వైద్యులు, మైలవరం